నాన్నా.. లే ఆకలేస్తుంది!

రత్తం వొస్తుంది.. నొప్పయితుంది

తండ్రి మృతదేహం వద్ద రెండేండ్ల కొడుకు రోదన

విజయవాడ హైవేపై బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం

పాల ప్యాకెట్‌ల కోసం వచ్చి వెళ్తుండగా ప్రమాదం

అక్కడికక్కడే తండ్రి మృతి.. కుమారుడికి గాయాలు

పెద్దఅంబర్‌పేట, మే 30 : పాల ప్యాకెట్ తీసుకొచ్చేందుకు కుమారుడిని వెంట బెట్టుకొచ్చిన తండ్రిని డీసీఎం రూపంలో మృత్యువు వెంటాడింది. ఆ పసివాడి కండ్ల ముందే తల్లడిల్లి తండ్రి చనిపోయాడు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారిపై ఇనామ్‌గూడ కమాన్ దగ్గర గురువారం ఉదయం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా కొప్పూరు మండలంలోని పసివేదుల గ్రామానికి చెందిన శెట్టి కనకప్రసాద్ (30)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో రెండేండ్ల శివకుమార్ పెద్దవాడు. చిన్నవాడి వయసు ఆరునెలలే. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనోపాధి పొందుతున్న కనకప్రసాద్ మూడునెలల కిందట అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఇనామ్‌గూడకు వచ్చాడు. తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఇక్కడే నివసిస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో కుటుంబసభ్యుల కోసం టిఫిన్లు, పిల్లలకు పాల ప్యాకెట్‌లు తీసుకొచ్చేందుకు కనకప్రసాద్ తన రెండేండ్ల కొడుకు శివకుమార్‌తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న అబ్దుల్లాపూర్‌మెట్ చౌరస్తాలో టిఫిన్లు, పాల ప్యాకెట్లు తీసుకుని, తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ఇనామ్‌గూడ కమాన్ ఎదురుగా యూటర్న్ తీసుకుంటుండగా.. అదే సమయంలో వెనకనుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం వీరి బైక్‌ను ఢీకొట్టింది. కనకప్రసాద్‌తో పాటు కొడుకు శివకుమార్ రోడ్డుపై పడిపోయారు. కనకప్రసాద్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శివకుమార్‌కు సైతం గాయాలయ్యాయి. కండ్ల ముందే తండ్రి విగతజీవిగా పడి ఉండగా.. 'నాన్నా లే.. ఇంటికి పోదాం.. ఆకలేస్తుంది' అంటూ చిన్నారి చేసిన రోదనలు అటుగా వెళ్తున్న వారిని కంటతడిపెట్టించాయి. తండ్రి లేచి ఎత్తుకోలేడన్న విషయాన్ని సైతం తెలియని పసిహృదయం.. మృతదేహాన్ని చూస్తూ ఏడ్వడం అక్కడ విషాదాన్ని నింపింది. పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. చిన్నారికి వైద్యం అందించే ప్రయత్నం చేశారు. నిర్లక్ష్యంగా డీసీఎం నడిపి, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గాయపడ్డ శివకుమార్



కాంగ్రెస్‌లో గడబిడ!

- పాలన ఇంకా గాడిన పడనే లేదు
- ఎందుకీ అనవసర వివాదాలు?
- గ్యారెంటీలపై జనంలో వ్యతిరేకత
- సొంతపార్టీ నేతల్లో అంతర్మథనం
- అధిష్ఠానానికి అందిన ఫిర్యాదులు
- అధికారిక లోగోపై వెనక్కి తగడం
- వెనక అసలు కారణం ఇదేనా?

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం మార్పు, రాష్ట్ర గీతంపై వివాదం అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా చిచ్చు రేపింది. రేవంత్ వ్యక్తిగత ఎజెండా, కక్షసాధింపు చర్యలు, ఏకపక్ష నిర్ణయాల వల్ల పార్టీకి, ప్రభుత్వానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడిందన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో మొదలైంది. ప్రజలిచ్చిన అధికారాన్ని దీర్ఘకాలం నిలుపుకొనే వ్యూహంతో ముందుకెళ్లాల్సింది పోయి ఇలా వివాదాస్పద నిర్ణయాలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడం ఏమీ బాగోలేదని మంత్రులు సైతం అంతర్గత సంభాషణల్లో తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నట్టు సమాచారం. రేవంత్‌రెడ్డి దుందుడుకు చర్యల వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నదన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గాడిలో పడకముందే వివాదాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారపగ్గాలు చేపట్టి దాదాపు ఆరునెలలు కావొస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం పూర్తిగా నెరవేర్చలేదు. ఈ విషయంలో ప్రజల్లో ఉన్న వ్యతిరేకత పార్లమెంటు ఎన్నికల సమయంలో ప్రస్ఫుటంగా కనిపించింది. ఫలితాల సమయంలో ఇది కనిపించే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. అధికార యంత్రాంగంపై ఇంకా పట్టు లభించలేదని, ప్రభుత్వం ఇంకా గాడిలో పడలేదని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యుత్తు కొరత, రైతులకు రుణమాఫీపై ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం, రైతుబంధు సకాలంలో అందజేయకపోవడం, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు రూ.2500 చెల్లిస్తామన్న హామీ నిలబెట్టుకోలేదని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ప్రజలు నిలదీసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మరోవైపు అకాల వర్షాల వల్ల సంభవించిన భారీ నష్టం, తడిసిన వడ్లు, ధాన్యం కొనుగోలు సమస్యలు చుట్టిముట్టిన తరుణంలో సన్నవడ్లకే బోనస్ ఇస్తామని మాట మార్చడం పట్ల రైతన్నలు ఆగ్రహంతో ఉన్నారు. దీనికితోడు మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా విత్తనాల కొరత వేధిస్తున్నది. ఇలాంటి సమయంలో రేవంత్‌రెడ్డి అనవసరంగా రాష్ట్ర చిహ్నం, రాష్ట్ర గీతంపై వివాదం రేపడం అవసరమా? అని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. వారం రోజులుగా రాష్ట్రంలో రాజుకున్న ఈ వివాదంపై పార్టీలో ముఖ్య నేతలు ఎవరూ నోరుమెదపకపోగా, మంత్రులు అందరూ పదరుకున్నటే ఈ వివాదానికి దూరంగా ఉండడంపార్టీలో అంతర్గతంగా రేగిన చిచ్చుకు నిదర్శనమని చెప్తున్నారు. ఈ విషయాన్ని కొందరు నాయకులు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతున్నదో తమకు ఎందుకు చెప్పడం లేదని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని అధిష్ఠానం ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ కారణంగానే ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో ఎప్పుడూ కనిపించని దీపాదాస్ మున్షీ సచివాలయంలో గురువారం సీఎం అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరుకావడం వెనక కారణం అదే అయి ఉంటుందని పార్టీ నాయకుడు ఒకరు అభిప్రాయపడ్డారు.

అధిష్ఠానం జోక్యం వల్లనే వెనక్కి తగ్గారా?

రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం మార్పు, రాష్ట్ర గీతంపై వివాదానికి మంత్రులు దూరంగా ఉండటం, అది సీఎం రేవంత్‌రెడ్డి చుట్టే తిరగడం అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. దీనికి తోడు కొందరు మంత్రులు కూడా ఈ విషయాన్ని అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ అంశంపై అధిష్ఠానం సంజాయిషీ కోరిన తర్వాతే ఇందులోకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సీఎం రేవంత్‌రెడ్డి లాగి, తన ఒక్కడి నిర్ణయం కాదని, తామందరి సమిష్టి నిర్ణయంగా చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ భట్టి అంటీముట్టనట్టు వ్యవహరించి ఒడిశాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లినట్టు తెలిసింది. ఈ వివాదంలో తను ఒక్కడినే టార్గెట్ చేసేలా ఉన్నారనే విషయం రేవంత్‌రెడ్డి పసిగట్టిన తర్వాతే రాష్ట్ర చిహ్నం మార్పుపై ఇంకా విస్తృత చర్చ జరగాలనే సాకుతో వాయిదా వేసి, రాష్ట్ర గీతాన్ని యథాతథంగా ఆమోదించి ఉండవచ్చని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ పరిశీలకులు సైతం కారణం అదే అయిఉండవచ్చని చెప్తున్నారు.

నమస్తే తెలంగాణపై ప్రెస్ కౌన్సిల్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ 'నమస్తే తెలంగాణ' పత్రికపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ)కి ఫిర్యాదు చేసింది. తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నారని ఆరోపించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నదని అంటూ ఈ నెల 27న నమస్తే తెలంగాణలో ఓ వార్త ప్రచురితమైందని తెలిపింది. ఆ వార్త పూర్తిగా అసత్యమని, నిరాధారమైనదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు నమస్తే తెలంగాణపై అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది.

బకాయిలు చెల్లించండి: కాంట్రాకర్లు

బన్సీలాల్‌పేట్, మే 30 : తెలంగాణలోని ప్రభుత్వ దవాఖానాల్లో రోగులు, డ్యూటీ డాక్టర్లకు ఆహారం సరఫరా చేస్తున్న డైట్ క్యాంటీన్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ డైట్ క్యాంటీన్ సప్లయర్స్ వెల్ఫేర్ అసోసియేన్ ప్రతినిధులు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, డీఎంఈ డాక్టర్ ఎన్ వాణి, వైద్యశాఖ కమిషనర్‌ను గురువారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఏడాది కాలంగా బిల్లులు రాకపోవడంతో క్యాంటీన్లు నడపడం కష్టంగా మారిందని చెప్పారు. సికింద్రాబాద్ గాంధీ దవాఖానలో రూ.5 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్ రవికుమార్ తెలిపారు. ఉస్మానియా, నిలోఫర్, పెట్లబుర్జు, సంగారెడ్డి, వరంగల్, సూర్యాపేట ప్రభుత్వ దవాఖానలకు ఆహారం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు తమ ఆర్థిక ఇబ్బందులను వివరించారు.

ఓఅండ్ఎం ఈఎన్సీగా హుస్సేన్..?

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖలో కీలకమైన ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ ఎం) విభాగానికి ఈఎన్సీగా అమ్జద్‌హుస్సేన్‌కు బాధ్యతలను అప్పగించినట్లు తెలుస్తున్నది. ప్రస్తుత ఈఎన్సీ నాగేందర్‌రావు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందనున్న నేపథ్యంలో ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తున్నది. నేడు ఉత్తర్వులు వెలువడే అవకాశమున్నది.

మూడు నెలలుగా జీతాల్లేవ్

- ఇది ప్రజారోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం
- ఎక్స్ వేదికగా స్పందించిన మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ తదితర 78 విభాగాలలో పనిచేస్తున్న 17,541 మంది సిబ్బందికి జీతాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గురువారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రజల ఆరోగ్యాలను సంరక్షించేందుకు నిరంతరం కృషి చేసే వైద్య సిబ్బందికి నెలలుగా జీతాలు చెల్లించకపోవడం ప్రజారోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతున్నదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనాఉద్యోగులకు పెండింగ్ జీతం, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి

హైదరాబాద్, మే30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 20 లక్షల మంది విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు రూ.7వేల కోట్లను విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ భవన్‌లో గురువారం బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేశ్, బీసీ సంఘం అధ్యక్షుడు రాజేందర్ అధ్యక్షతన 13 బీసీ సంఘాలతో కొనసాగిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో ఫీజులు కట్టాలని కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని, దీంతో వారు వేదనకు గురవుతున్నారని వాపోయారు.

సీవోఈలో 3వ తేదీలోగా అడ్మిషన్ పొందాలి

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ ఆధ్వర్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థులు 3వ తేదీలోగా నిర్దేశిత గురుకులంలో అడ్మిషన్ పొందాలని సీవోఈ అధికారులు వెల్లడించారు. నాలుగో విడతలో మొత్తంగా 320 సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్ పరీక్షల్లో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇచ్చేందుకు సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ 38 సీవోఈలను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 3680 సీట్లకు 3360 సీట్లు భర్తీ చేసినట్టు తెలిపారు.

1 నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు నేటితో వేసవి సెలవులు ముగుస్తున్నాయి. రేపటి నుంచి కాలేజీలు తెరుచుకుంటాయని తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ వసుంధరాదేవి గురువారం ప్రకటన విడుదల చేశారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించండి

హైదరాబాద్, మే 30(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని భాషా పండితులకు హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం వెంటనే బదిలీలు, పదోన్నతులు కల్పించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే టెట్ నుంచి కూడా భాషా పండితులకు మినహాయింపు ఇచ్చినట్టు తెలిపారు. నాయకులు అబ్దుల్లా, తిరుమల కాంతికృష్ణ, విజయభాస్కర్, హన్మకొండ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఉన్నారు.

'పాఠశాలల్లో సైకాలజిస్టు సేవలు వినియోగించుకోవాలి'

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో సైకాలజిస్టుల సేవలు రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు మోత్కూరి రామచంద్రం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైకాలజిస్టులను ప్రతీ పాఠశాలల్లో నియమించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఒత్తిడి తగ్గించడంతో పాటు మానసిక అంశాలపై అవగాహన అవసరమని తెలిపారు.

ఫీజుల నియంత్రణకు రెగ్యులేటరీ కమిటీ ఏది?

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు ఫీజు రెగ్యులేటరీ కమిటీ వేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు నెలలుగా ఎందుకు మౌనంగా ఉన్నారని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో విద్యా వ్యవస్థ దుర్భర పరిస్థితుల్లోకి వెళ్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

డాక్టర్ ఇస్తారికి పేటెంట్ సర్టిఫికెట్

హనుమకొండ చౌరస్తా, మే 30: అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి చేసిన 'అంత్రాక్వినోన్ ఆఫ్ రుమేక్స్ వేసికారియాస్ యాజ్ ఏ డై-పెప్టిడైల్ పెప్టిడేజ్ ఇన్హిబిటార్' పరిశోధనకు భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం పేటెంట్ సర్టిఫికెట్‌ను జారీ చేసింది. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ.. రుమేక్స్ వేసికేరియస్ మొక్క నుంచి అంత్రాక్వినోన్ రకానికి చెందిన రసాయనిక మూలకం ద్వారా డీపీపీ-4 క్రియాశీలతను తగ్గించడానికి అనువైన పద్ధతిని ప్రవేశ పెట్టినందుకు భారత పేటెంట్ కార్యాలయం ఈ పేటెంట్‌ను జారీ చేసిందని తెలిపారు.

అధిక వడ్డీల ఆశ చూపి 200 కోట్ల మోసం

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): బ్యాంక్‌లో పనిచేస్తూ తోటి ఉద్యోగులు, డిపాజిట్‌దారులను నమ్మించి చిట్‌ఫండ్‌లో భారీగా డిపాజిట్లు చేయించి రూ.200 కోట్లతో బిచాణా ఎత్తేసిన తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టీఎస్‌కాబ్) జీఎం వాణిబాల, ఆమె భర్త, కొడుకును సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. దర్యాప్తు కొనసాగుతున్నదని పోలీసులు పేర్కొన్నారు.

'ప్రకృతి మిత్ర' లోగో ఆవిష్కరణ

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ) : అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ గురువారం ఐఆర్‌డీఏ స్వచ్ఛంద సేవా సంస్థ రూపొందించిన 'ప్రకృతి మిత్ర' లోగోను హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. గిన్నిస్‌బుక్ రికార్డు లక్ష్యంగా వేస్ట్ పేపర్‌ను సేకరించి, రీసైకిల్ చేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్కులను అందించాలనే లక్ష్యంతో ఐఆర్‌డీఏ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమైనదని మంత్రి కొనియాడారు.

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ 5కి వాయిదా

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంటర్ పరీక్ష స్పాట్ వాల్యుయేషన్ క్యాంపులను జూన్ 1 నుంచి 5 వరకు వాయిదా వేస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. గురువారం బోర్డు సెక్రటరీ అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు.

ముగ్గురు తహసీల్దార్లు పరార్

- అక్రమంగా పట్టాలు పొందిన కేసులో మాజీ వీఆర్వోతో సహా ముగ్గురికి రిమాండ్

నిడమనూరు, మే 30: నల్లగొండ జిల్లాలో నకిలీ సర్టిఫికెట్లతో అక్రమంగా పట్టాలు పొందిన వ్యవహారంలో ముగ్గురు నిందితులను పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ భూ బాగోతంలో నిందితులుగా ఉన్న మరో ముగ్గురు తహసీల్దార్లు పరారీలో ఉన్నారు. నిడమనూరు మండలం తుమ్మడం గ్రామ శివారులోని 541,961,840,1072 సర్వే నంబర్లలోని తొమ్మిది ఎకరాల భూమికి బొమ్ము ఆదిలక్ష్మి, మార్తి సురేందర్‌రెడ్డి, మార్తి శ్వేత, మార్తి నిర్మల నకిలీ పట్టాలతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందినట్టు ఆరోపణలున్నాయి. మార్తివారిగూడెం గ్రామానికి చెందిన మార్తి వెంకట్‌రెడ్డి 2022లో అప్పటి నల్లగొండ జిల్లా కలెక్టర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్పటి తహసీల్దార్ ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో వేగం పెంచాలని మార్తి వెంకట్‌రెడ్డి ఇటీవల మరోమారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మొదటి నిందితుడు బొమ్ము శ్రీనివాస్, రెండో నిందితుడు ముదిగొండ సుమన్, ఏడో నిందితుడు మార్తి సురేందర్‌రెడ్డిని గురువారం మిర్యాలగూడ కోర్టులో ప్రవేశపెట్టారు. తహసీల్దార్లు దేశ్యానాయక్‌ను ఏ3గా, నాగార్జునరెడ్డిని ఏ4గా, ఏఆర్ నాగరాజును ఏ5గా పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో చేర్చారు.

అభియోగాలు

ఈ కేసులో వీఆర్వో వ్యక్తిగత సహాయకుడు బొమ్ము శ్రీనివాస్ తన భార్య ఆదిలక్ష్మి పేరున ఐదెకరాలు, మార్తి సురేందర్‌రెడ్డి తన భార్య శ్వేత పేరున 2.19 ఎకరాలు, మార్తి నిర్మల పేరున 1.20 ఎకరాల భూమికి 2007లో తహసీల్దార్‌గా పనిచేసిన టీ విద్యాసాగర్ సంతకాలను ఫోర్జరీ చేసి పట్టా సర్టిఫికెట్లు పొందినట్లుగా వీరిపై అభియోగాలు ఉన్నాయి.

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలి

- బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్

తెలంగాణ చౌక్, మే 30: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని తారక హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో రాజారాం యాదవ్ మాట్లాడుతూ... కామారెడ్డి ఎన్నికల సభలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ అమల్లోకి వస్తే దాదాపు 23 వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ జూన్ 8న మహాధర్నా,15న సెక్రటేరియట్ ముట్టడిని విజయవంతం చేయాలన్నారు.

ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి రిలీవ్

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రోడ్లు, భవనాలు, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 2001 బ్యాచ్ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాస్‌రాజు గురువారం విధులనుంచి రిలీవ్ అయ్యారు. శ్రీనివాస్‌రాజు మే 2020 నుంచి డిప్యూటేషన్ పై తెలంగాణలో కొనసాగుతున్నారు. మూడేళ్ల డిప్యూటేషన్ గడువు నిరుడు మేలో పూర్తవడంతో మరో రెండేళ్లు పొడిగించాలని ఆయన కోరారు. దీనికి ఇరు రాష్ట్రాలు అంగీకరించినప్పటికీ కేంద్రం అభ్యంతరం తెలిపింది. దీంతో ఆయన సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా ఈ ఏడాది మార్చి 31వరకు కొనసాగేందుకు అవకాశం లభించింది. గురువారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేంద్ర బోయికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

కంపెనీల్లోనే తగ్గిన బీర్ల ఉత్పత్తి

- పత్రికల్లో వస్తున్న వార్తా కథనాలు అవాస్తవం
- ఎక్సైజ్ కమిషనర్ ఈ శ్రీధర్ వివరణ

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో బ్రూవరీస్ కంపెనీలకు మూడో షిఫ్టు అనుమతించకపోవడం వల్లనే బీర్లకు కృత్రిమ కొరత ఏర్పడిందనే వార్తలను ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ఈ శ్రీధర్ తోసిపుచ్చారు. ఆయన గురువారం ఒక ప్రకటన చేస్తూ.. తెలంగాణలో ఆరు బీరు తయారు చేసే కంపెనీలు ఉండగా.. లైసెన్స్ షరతుల ప్రకారమే బీర్లు ఉత్పత్తి చేయడానికి వాటిని అనుమతి ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో డిమాండ్ మేరకు, బ్రూవరీస్ అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని అవసరమైన రుసుం చెల్లించిన వారికి మూడు షిఫ్టులకు అనుమతి ఇచ్చామని పేర్కొన్నారు. ఆరు బ్రూవరీస్‌లో నాలుగు కంపెనీల రోజువారి ఉత్పత్తి సామర్థ్యం 1,66,000 కేసులని, వారు మూడు షిఫ్టుల్లో 4,98,000 కేసులు తయారు చేయాల్సి ఉంటుందని వివరించారు. కానీ అవి మూడు షిఫ్టుల్లో కేవలం 2.51 లక్షల కేసుల బీరును మాత్రమే ఉత్పత్తి చేస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో వేసవిలో సరాసరి రోజుకు 2 లక్షల కేసుల బీరు అమ్ముడుపోతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్రూవరీస్ కార్పొరేషన్ డిపోల్లో, బ్రూవరీస్‌లో 7.57 లక్షల కేసుల బీరు నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. మార్కెట్‌లో కింగ్ ఫిషర్ బ్రాండ్ తప్ప మిగిలిన అన్ని రకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొత్త బ్రాండ్‌ల అనుమతికి సంబంధించి చాలా ఏండ్లుగా ఉన్న పద్ధతినే కొనసాగిస్తున్నట్టు తెలిపారు. గత ఐదేండ్లలో దాదాపు 360 కొత్త మద్యం బ్రాండ్లకు అనుమతి ఇచ్చామని తెలిపారు. గడిచిన ఐదు నెలల్లో నాలుగు బీరు బ్రాండ్స్‌ను సరఫరా చేయడానికి కార్పొరేషన్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ విషయంపై పత్రికల్లో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదని వివరణ ఇచ్చారు.

సమస్యల్లో సర్కారీ కాలేజీలు

- శిథిల భవనాల్లో 18, స్కూళ్లలో నడిచేవి 24 జూనియర్ కాలేజీలు
- 86 కళాశాలల్లో ఆర్వో ప్లాంట్లు లేవు
- 227 కాలేజీలకు ప్